కథ

**సూర్యకిరణాలు బంగారు కాంతిలో ప్రజ్వరిల్లుతోన్న సూర్య దేవాలయం. కన్రెప్పలార్పినా ప్రాచ్య సౌందర్యపు నీలిమ. ఎందరో ఎవరో ఒక్కో రాయిని శిల్పంగా మలిచారు. అతినిశ్శబ్దంగా కల్సిపోయారు. వాళ్ళందరు ఎక్కడున్నారని వెతకను? ఎలా వాళ్ళని ఆలింగనం చేసుకోను? కళ్ళల్లో... గుండెల్లో కదలాడే ఈ సంపూర్ణ కట్టడాన్ని సమస్త దేహంతో ఆలింగనం చేసుకోవాలి...**




సరుగుడు తోటల నుంచి తేలివచ్చే సముద్ర గాలి సవ్వడిలా నవ్వు... చిరపరిచితమయిన నవ్వు. గుండెల్లో నిత్యశ్రావ్య సంగీతం... నా మోహన, కళ్యాణి... జుగల్‌బందీ... చూపులు తిప్పుక్కోలేదు. నాకు తెలుసు... ఆ నవ్వు... ఒకేవొక్క నవ్వు... నా రహస్య ప్రపంచపు ప్రేమైన సౌందర్యానందం ఆ నవ్వు. ఆ నవ్వు... ఆ నవ్వు కోణార్క నవ్వు.

ఆ నవ్వు వైపు నడిచాను.

''కోణార్క'' పిలిచాను.

మెడ మీదుగా తలతిప్పి చూసింది. కళ్ళనిండా నీళ్ళు. 'నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే' ఆత్రేయ కోణార్క లాంటి అమ్మాయిని చూసే ఆ మాటన్నాడేమో?! రవ్వంత చల్లనిగాలికి వర్షించే మేఘశకలంలా కూసింత నవ్వుకి కూడా ఆమె నయనాలు నీళ్ళు చిప్పిల్లుతాయి.

ఆమె కళ్ళలోంచి విస్మయానందాలు జలజలా రాలిపోతుంటే ''అనూ'' అంటూ దగ్గరికి వచ్చిందామె.

''ఎంత ఆశ్చర్యంగా కన్పించావ్? ఏంటంతలా నవ్వుతున్నావ్?'' అడిగాను.

''ఈ గైడ్‌గారితో తగాదా. విషయం ఏంటంటే మా అమ్మానాన్నగారికి ఇక్కడే పరిచయమయిందంట. అందుకే నాకీ పేరు పెట్టారంట. చాలాకాలంగా కోణార్క చూడాలనుకుంటున్నాను. ఇదిగో ఇప్పటికి వీలైంది. ఈ గైడ్‌గారికంటే ముందున్న గైడ్‌గారు నాకే భాషలు వచ్చో అడిగారు. చెప్పాను. ఆయన ఆడవాళ్ళ కొట్లాట, బొట్టు పెట్టుకోవడం, నీళ్ళు తోడటం లాంటివన్నీ మా గ్రూప్ మొత్తానికి వివరించారు. శృంగార భంగిమలు వివరించినప్పుడు మాత్రం స్త్రీలందరిని పక్కకి పంపించి మగవాళ్ళకి మాత్రం వివరించారు. ఆ బొమ్మల్ని ఇక్కడ ఎందుకు చెక్కారో, ఆ రమ్య సౌందర్య శిల్పాల వెనుక కథేంటో మాకు తెలుసుకోవాలనుంటుంది కదా. ఈ గైడ్‌గారిని పట్టుకొని ఇంగ్లీషు తప్ప మరే భాషా రాదని చెప్పాను. అన్నీ ఇంగ్లీషులో వివరించి వాటిని మాత్రం హిందీలో మగవాళ్ళకి చెపుతున్నారు. అంతా విని చివరలో గైడ్‌గారికి హిందీలో కృతజ్ఞతలు చెప్పాను. హిందీ రాదని చెప్పి జ్ఞానం తెలుసుకున్నానని అతనికి కోపం వచ్చింది'' అందామె నవ్వుతూ.

గైడ్‌గారు చురచురా చూస్తూ వెళ్ళిపోయాక ''ఊ... చెప్పు ఎక్కడుంటున్నావ్?'' అడిగాను.

''అవన్నీ తరువాత. ఆ పక్కంతా చూడలేదు. వస్తావా చూద్దాం'' అంది.

''సరే''

ఆమె కుతూహలంతో విప్పారిన నేత్రాలతో దేవాలయ ప్రాంగణమంతా కలియతిరుగుతోంది.

చీకటి మెల్లగా పర్చుకుంటుంది.

''బయటికి నడవండి'' అంటూ సిబ్బంది సందర్శకులని వెలుపలికి పంపించేస్తున్నారు.

ఆమె కదల్లేదు. ఓ మూలకి వొదిగి కూర్చుండిపోయింది. ''రా కోణార్క'' అన్నాను.

''ష్...'' అంటూ మాట్లాడొద్దని చేత్తో సైగ చేసింది.

సందర్శకుల కోలాహలం చెవి మరుగైంది.

ఆమె వైపే అయోమయంగా చూస్తున్నాను.

''రా అనూ ఇటొచ్చి కూర్చో'' అంది.

ఆమెకి ఎదురుగా మూలకి చేరబడి కూర్చున్నాను.

''మనం ఎప్పుడు ఆ ఇళ్ళల్లోనే ఉంటాంగా. ఈ రాత్రికి ఈ పురాతన సౌధంలో ఉండాలని ఉంది. ఉంటావా? నీకు ఉండాలని లేకపోతే వెళ్ళిపోవచ్చు'' అంది.

సూర్యదేవాలయంలో... రాత్రంతా... వింటూంటేనే ఊపిరి ఆగిపోయినట్టుంది.

''ఎవరైనా చూస్తే'' అన్నాను సందేహంగా.

''పొమ్మంటారు'' అంది.

''కోప్పడతారేమో?''

''నీకు ఒరియా వచ్చా?''

''రాదు''

''ఇంకెందుకు బాధ. వాళ్ళు ఒరియాలోనే అంటారుగా'' అంది.

చీకటి నిండుగా సంతరించుకుంది. ముఖబింబం కన్పించటం లేదు. ఊపిరి సంగీతం విన్పిస్తోంది.

''నువ్వేం చేస్తున్నావ్?''

''ఈ శిల్పాల గీతం వింటున్నాను''

నవ్వొచ్చింది. నువ్వేం చేస్తున్నావ్? ఎక్కడున్నావ్ అని అడుగుతున్నాను. ఆమె అసలా ప్రశ్నల్ని పట్టించుకోవడం లేదు. పైగా నన్నేం అడగడమూ లేదు.

''మంచినీళ్ళు లేవ్. తింటానికి ఏం లేవ్'' అన్నాను.

''ఇంకా తలుపులు తీసే ఉంటాయ్. ఉండలేకపోతే వెళ్ళొచ్చు'' అంది.

''నేను లేకపోయినా నువ్వుంటావా?''

''ఆ''

''ఎలా''

''ఇప్పుడు ఎలా ఉన్నానో అలా''

''ఇప్పుడా?! నేనున్నాగా''

''ఉన్నావా? ఎక్కడా?''

ఉలిక్కిపడ్డాను.

''గోవిందు ఎలా ఉన్నాడు?'' అడిగాను.

''సెక్యూరిటీతో''

''అంటే''

''రవ్వంత ఏకాంతం కోసం... ఓ చిన్ని ముద్దు కోసం చీకటిని ఎంతగా కోరుకునేవాళ్ళం. ఆ చీకటి కోసం ఏ దీపాన్ని ఉంచేవాళ్ళం కాదు. బీచ్ రోడ్లులో, హాస్టల్లో, పార్కులోని బల్బుల్ని పగలగొట్టేసేవాళ్ళం. ఇప్పుడు అతని చుట్టూ సెక్యూరిటీ. తుపాకుల మధ్య ప్రారంభోత్సవాలకి వెళుతుంటాడు'' అందామె.

''బాగా వృద్ధిలోకి వచ్చాడన్నమాట. అతనంత కాకపోయినా నాకూ మంచి ఉద్యోగం దొరికింది. ఓ పాప. ఆమె కూడా చాలా మంచిది. ఇన్నాళ్ళు నువ్వేం చేస్తున్నావ్ కోణార్క'' అడిగాను.

''స్నేహాలు''

తల దించుకున్నాను.

ఎందుకిలా జరుగుతుంది. బాహ్య వివరాలు మాట్లాడినంతగా అంతఃర్లోకాల ఊసులెందుకు బయటికి రావు. ఒక్కసారి కూడా ఆ విషయాలని మాట్లాడనెందుకో?

వెన్నెల మరింతగా పర్చుకుంది.

ఆమె కూర్చున్నచోట నుంచి లేచి తలెత్తి ఆలయాన్ని చూస్తుంది.

''నీకీ ఆలయాన్ని చూస్తే ఏమనిపించింది'' అడిగాను.

''ఉండిపోవాలనిపించింది ఉండిపోయాను''

''నన్ను చూస్తే''

''నువ్వా ఉంటే బాగుండుననిపించింది అడిగాను'' అంది.

ఆమె చుట్టూ చూస్తూ ''నీకేమనిపించింది'' అడిగింది.

''ఆలింగనం చేసుకోవాలనిపించింది'' అన్నాను.

''ఎవర్ని''

''కోణార్కని''

నావైపు చూపులు తిప్పి ''తరువాత అసాధ్యమనిపించిందా?'' అంది.

''ఆ...''

వెన్నెల రవ్వంత తేటపడింది.

''అవునూ నువ్వూ గోవిందూ మంచి స్నేహితులు కదా... మరి - తరువాత విడిపోయారేం'' చాలాకాలంగా నాలో నలుగుతున్న ప్రశ్నని అడిగాను.

''ఆ గతం వినాలని ఉందా?''

''ఆ...''

''ఎందుకో''

''నువ్వు ఆనందంగా ఉన్నావా?'' అడిగాను.

''ఊ... నువ్వూ...''

''బాధలు కష్టాలు. మనుష్యులం కదా... ఉంటాయ్. స్టీల్ వీటన్నిటి మధ్య కూడ నన్నెప్పుడూ అంటిపెట్టుకున్న ఆనందం ఉంది. నాకంటూ ఓ రహస్య ప్రపంచం ఉంది కదా''

''నీ రహస్య ప్రపంచమా'' ఆమె నా కళ్ళల్లోకి చూస్తుంది.

ఆమె చూపుల్ని తప్పించుకుంటూ ''గోవిందు విషయం చెప్పు'' అన్నాను.

''నీకు తెలియదా'' అందామె.

''నాకేం తెలుసు'' ఆలోచిస్తున్నాను.

గుంపులు గుంపులుగా జంటలుగా... హుషారుగా సీతాకోకచిలుకల సమూహం వనం నుంచి నగరానికొచ్చినట్టు. ఎటు చూసినా అమ్మాయిలు అబ్బాయిలే.

ఓ కుర్రాడిని ర్యాగింగ్ అంటూ ఓ గుంపు చుట్టుముట్టింది. ఆట పట్టిస్తుంది. కాలేజీకో నమస్కారం. వెళ్ళిపోవాలి. వెళ్ళిపోవాలి - అతను ఓ నిశ్చయానికి వచ్చేస్తుండగా వాళ్ళ నుంచి అతన్ని తప్పించిందామె.

అతను గోవిందు.

ఆమె కోణార్క.

గోవిందూ, అనూ మంచి స్నేహితులు. అనూ కోణార్కని రెప్పలార్పకుండా చూసేవాడు. పొల్లు పోకుండా వినేవాడు. ఆమె పాడితే మైమరచిపోయేవాడు. కానీ ఆమెతో ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. గోవిందూ కోణార్క ఎప్పుడూ కలిసి కన్పిస్తుండేవారు. హఠాత్తుగా ఇద్దరూ విడివిడిగా కనిపించసాగారు.

''మీరిద్దరూ ఎందుకు కలిసారో? ఎందుకు విడిపోయారో నాకేం తెలుసు'' అన్నాను.

''కోణార్కా...'' పిలిచాడు.

''వూ...'' అందామె.

''ఎత్తైన గుట్టలు. రోడ్డు మీద నుంచి వెళుతుంటే గోదారి కనిపించదు. ఆ గుట్ట ఎక్కి కొద్దిగా కిందకి దిగగానే గోదారి... ఆ గోదారి నాలో కలిగించినంత మైమరపు నిన్ను చూసినప్పుడు కలిగింది. ఆ పల్లె నుంచి చదువు కోసం ఇక్కడికి వచ్చేటప్పుడు ఎంత బెంగపడ్డాననుకున్నావ్... ఆ రోజు నాకు బాగా గుర్తు. ఈ భవనాలు పెద్దగా పరిచయం లేని భాష. నువ్వు కన్పించావ్. చిర్నవ్వుతో. ప్రేమ నిండిన చూపులతో. నిజం చెప్పనా కోణార్క... నిన్ను చూడగానే మా ఊరి గోదారి కళ్ళముందు కదిలింది. నువ్వు కన్పించి ఉండకపోయినట్లయితే తిరిగి నేను మా పల్లెకి వెళ్ళిపోయి వ్యవసాయం చేసుకునేవాణ్ణి''

''అరే అనవసరంగా కన్పించానే''

''అంటే''

''వ్యవసాయం కంటే మంచి పని ఏముంటుంది''

''ఉంటుంది''

''ఏంటి''

''నీ జుట్టుతో ఆడుకోవటం''

- ఆ గోవిందుని నేను ఇష్టపడ్డాను.

''నో... నో... నే వొప్పుకోను'' అంది కోణార్క.

''నీకు తెలియదు. నువ్వీ విషయాల్లో తలదూర్చకు'' అన్నాడు గోవిందు.

''నేనీ విషయాల్లో తలదూర్చొద్దా? ఏ విషయాల్లో దూర్చాలి'' అడిగిందామె.

''కోణార్కా... నేను ఇదంతా చేస్తుంది నేను గెలవాలని కాదు. నాకేం పేరుపట్ల మమకారం లేదు. అనర్హుడు గెలవకూడదా... నువ్వూ నా విషయాల్లో తోడుండాలనే కదా. లేడీస్ వోట్స్ అన్ని నాకు పడేట్టు చూడమని నిన్ను పురమాయించింది'' అన్నాడు.

''యూనివర్సిటీలో ప్రతి యేడూ ఎలక్షన్స్ జరుగుతుంటాయి. ఎవరో వొకరు గెలుస్తారు. నువ్వు గెలిస్తే చాలామందికి తోడుంటావనే నమ్మకాన్ని కలిగించు. అంతేకాని ఇది పద్ధతి కాదు. నీకు బలమైన పోటీ అనుకున్నవాళ్ళని గూండాయిజంతో నీదారికి అడ్డు తప్పించి నువ్వు గెలవాలనుకోవటం... నో.... నో... నేవొప్పుకోను'' అందామె.

''నువ్వు ఎన్నైనా చెప్పు. ఏమైనా అనుకో. వాడు మంచివాడు కాదు. వాడు గెలవటానికి వీల్లేదు'' అన్నాడు.

''అతను మంచివాడో కాదో నువ్వెలా చెప్పగలవ్. ఇద్దరో ముగ్గురో పదిమందో నిలబడతారు పోటీకి. ఎక్కువమంది ఎవరికి వోటేస్తే వాళ్ళు గెలుస్తారు. అంతే... లేదా వోపెన్ ఫైట్‌కి దిగు. అంతేకాని ఇలా దొంగ కిడ్నాప్ రాజకీయాలు నడపకు'' అందామె.

''ఇదంతా నాకోసం కాదు''

గోవిందు వైపు నిశితంగా చూసింది.

స్వచ్ఛత కోల్పోయిన చూపులు.

-ఈ గోవింద్‌ని నేను ఇష్టపడలేదు.

★ ★ ★

''అతను ఆ పద్ధతుల్లో మొదలై ఈ రోజు సెక్యూరిటీ వరకు చేరుకున్నాడు'' అంది కోణార్క.

నిశ్శబ్దం... బాగా పర్చుకున్న వెన్నెల... చలి వణికిస్తోంది.

''నువ్వు నన్నెప్పుడూ ఆశ్చర్యంలోకి నెట్టేస్తుంటావ్. ఏ స్పెషాలిటీ లేని గోవిందుతో నీ స్నేహం వింతగా ఉండేది. కాకపోతే మీ ఇద్దరికీ పాటలంటే ఇష్టం కదా. గోవిందు పాటే నిన్ను అతనికి చేరువ చేసిందేమోననిపించింది. వాడికి కాస్త మంచిదో చెడ్డదో ఓ పేరంటూ వచ్చే రోజుల్లో మీరిద్దరూ దూరంగా కన్పించసాగారు. ఎందుకో అర్థం కాలేదు. ఈ రోజు విషయం తెలిసాక నిజం చెప్పనా కోణార్క నువ్వు మరోసారి నా ఆంతరంగిక ప్రపంచాన్ని మరింత సుసంపన్నం చేశావ్. ఈ సూర్యదేవాలయాన్ని ఆలింగనం చేసుకోవటం ఎలా అని ఆలోచిస్తున్నానే తప్ప నిన్ను నేను ఏం చేసుకోను. నీకు తెలుసా కోణార్క నువ్వు నా రహస్య ఆంతరంగిక ప్రపంచానివి. నా ఆనందానివి'' ఎలా చెప్పానో ఆశ్చర్యంగా నేను మాట్లాడాను.

ఆమె రెండు చేతులూ చాచి ''రా'' అని ఆహ్వానించింది.

''అలా నేను ఆహ్వానించగలనా'' అనుకున్నాను.

''కోణార్కా... నిజమా... నిజంగా ఇంత అదృష్టానికి అర్హుడినా'' అడిగాను.

''ఆంతరంగిక ప్రపంచానికి మించిన అర్హత ఉంటుందంటావా'' నవ్వుతూ అందామె.

గోవిందు అందుకోలేనిది నేను అనుభవించనిది సునాయాసంగా కోణార్క తన హృదయమంతట నింపుకొంది.

తెలతెలవారుతోంది.

కోణార్క ప్రేమ చూపులతో సూర్యదేవాలయం ప్రజ్వరిల్లుతోంది.

★